
సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ఎస్ఆర్‌టీ కాలనీలో సమస్యల పరిష్కారానికి చర్యలు

● ఎమ్మెల్యే ముఠా గోపాల్

రాంనగర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): అడిక్‌మెట్ డివిజన్ ఎస్ఆర్‌టీ కాలనీలో తాగునీరు, డ్రైనేజీ, రోడ్డు ప్యాచ్‌వర్క్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. సోమవారం కాలనీలో జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. స్థానికులు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలు పరిష్కరించాలని జలమండలి డీజీఎం మోహన్‌రాజ్, జీహెచ్ఎంసీ ఈఈ సన్నీని ఆదేశించారు. బీఆర్ఎస్ అడిక్‌మెట్ డివిజన్ ప్రధాన కార్యదర్శి కె.సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

'కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానం రద్దు చేయాలి'

రాంనగర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ వాటర్‌వర్క్స్ అండ్ సివరేజీ బోర్డులో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానం రద్దు చేయాలని యూనియన్ అధ్యక్షుడు పి. నారాయణ డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో హైదరాబాద్ వాటర్‌వర్క్స్ అండ్ సివరేజీ బోర్డు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోర్డులో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతినెల 5వ తేదీ లోపు వేతనాలు చెల్లించాలని, మీటర్ రీడర్స్‌కు సింగిల్ ఏజెన్సీ ద్వారా వేతనాలు చెల్లించడంతోపాటు జీవో 60 ప్రకారం కేటగిరి - 2 ప్రకారం రూ. 19,500 వేతనం ఇవ్వాలని, కార్మికులందరికీ రూ. 20 లక్షల ప్రమాద బీమా చెల్లించాలని కోరారు. మృతి చెందిన కార్మికుల కుటుంబానికి రూ. 10 లక్షల పరిహారం ఇవ్వాలన్నారు. డీపీవో, డీఈవో ఉద్యోగులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. పీఎఫ్ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజరత్నం, సంతోష్‌కుమార్, బి.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మున్నూరుకాపుల సంక్షేమం కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ మున్నూరుకాపు యువజన సంక్షేమ సంఘం ప్రభుత్వాన్ని కోరింది. సోమవారం చిక్కడపల్లిలో సంఘం అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆరె దశరథం, మహేందర్ మాట్లాడారు. మున్నూరు కాపు సంఘం సభ్యులు భవన నిర్మాణం కోసం కృషి చేయాలని కోరారు.


విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ అందజేసిన కార్పొరేటర్ రచనశ్రీ, ఎస్ఐ చందన

విద్యార్థి దశ నుంచి సేవాభావం అలవర్చుకోవాలి

కవాడిగూడ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచి సేవా భావం అలవర్చుకోవాలని, స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న సేవలు అభినందనీయమని కార్పొరేటర్ జి. రచనశ్రీ అన్నారు. మా ఆప్‌కీ చాయ స్వచ్ఛంద సంస్థ సహకారంతో సోమవారం గగన్‌మహల్‌లో భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ పాఠశాలలో 85 మంది విద్యార్థులకు సేఫ్టీ న్యాప్‌కిన్స్, ఎగ్జామ్ ప్యాడ్స్ పెన్నులను కార్పొరేటర్, సెంట్రల్ జోన్ మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ చందన పంపిణీ చేశారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యదర్శి వరలక్ష్మి, మా ఆప్‌కి చాయ సంస్థ వ్యవస్థాపకుడు పిట్టల ధీరజ్‌కుమార్, అప్సా సీనియర్ కో-ఆర్డినేటర్ బొట్టు రమేష్ పాల్గొన్నారు.

ఇబ్బందులను అధిగమించాలి


మాట్లాడుతున్న స్వామి బోదమయానంద

కవాడిగూడ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): నిత్య జీవితంలో ఎదురయ్యే ఇబ్బందులను అధిగమించాలని రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోదమయానంద అన్నారు. రామకృష్ణమఠం స్వర్ణోత్సవాల్లో భాగంగా సోమవారం మఠంలో నిర్వహించిన స్పిరిచ్యువల్ రిట్రీట్‌లో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈనెల 13న సికింద్రాబాద్ మహబూబ్ కాలేజీలో స్వామి వివేకానంద డే నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువతీయువకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. స్వామి నిత్యానంద మాట్లాడుతూ.. ఆత్మసాక్షాత్కారమే జీవన లక్ష్యమని రామకృష్ణ పరమహంస చెప్పారని గుర్తు చేశారు. ఆధ్యాత్మిక జ్యోతి నిరంతరం వెలుగుతూ ఉండేలా చూసుకోవాలన్నది రామకృష్ణుల మాట అన్నారు. పలువురు స్వామీజీలు, రామకృష్ణ మఠంతో అనుబంధం ఉన్న వారు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ధర్నాలో బీజేపీ నేతలు

బాధితులకు ఓబీసీ మోర్చా సంఘీభావం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఇళ్లు కోల్పోయిన వివేకానందనగర్ బస్తీ వాసులకు బీజేపీ ఓబీసీ మోర్చా నేతలు అండగా నిలిచిరు. సోమవారం మోర్చా ముషీరాబాద్ కన్వీనర్ ఎం. ఉమేష్ ఆధ్వర్యంలో నేతలు బాధితులకు సంఘీభావం తెలుపుతూ ధర్నా నిర్వహించారు. మోర్చా జాతీయ కన్వీనర్ పూస రాజు మాట్లాడుతూ.. 15 రోజులుగా బాధితులు నిరసన దీక్ష చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ధర్నాలో ఓబీసీ మోర్చా సీనియర్ నాయకులు సదానంద్‌ముదిరాజ్, రమేశ్‌రామ్, ఎ. వినయ్‌కుమార్, ఎం. నవీన్‌గౌడ్, మద్దూరి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ మేధతో రోగాలకు చికిత్స

చిక్కడపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేధతో ప్రత్యామ్నాయ మార్గాల్లో పలు రోగాలకు చికిత్స చేయగలమని ప్రముఖ వైద్యుడు డా. రఘు ఆర్య అన్నారు. చిక్కడపల్లిలో జూనియర్ చాంబర్ ఇండియా(జేసీఐ) కార్యాలయంలో సోమవారం ఫ్రీక్వెన్సీ థెరపీపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కృత్రిమ మేధను వ్యక్తి మొబైల్‌కు అనుసంధానించి ఆ వ్యక్తికి సంబంధించిన శారీరక, మానసికరుగ్మతలను ఆధ్యాత్మిక చింతనతో నివారించవచ్చన్నారు. దీనికి పలు దేశాల్లో మెడికల్ కౌన్సిల్స్ ఆమోదం తెలిపాయన్నారు. జేసీఐ అలుమిన్ని క్లబ్ జోన్ 12 చైర్మన్ జీవీఎస్ రాజు, వైస్ చైర్మన్ జి. సురేందర్‌రెడ్డి, డా. చందన, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మార్కండేయ జయంతి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ జయంతి ఎస్ఆర్‌టీకాలనీలో లలితాపరమేశ్వరి దేవాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. బీజేవైఎం నగర మాజీ అధ్యక్షుడు ఎ. వినయ్‌కుమార్, పద్మశాలి సంఘం అధ్యక్షుడు రచ్చ శ్రీనివాస్, రాజ్ మోహన్, బోనం ఊర్మిళ, బాలరాజ్, వెంకటేష్, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

'మధుగౌడ్ మృతి బీజేపీకి తీరని లోటు'

ముషీరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సీనియర్ నాయకుడు మధుగౌడ్ మృతి పార్టీకి తీరని లోటని ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్ అన్నారు. సోమవారం ముషీరాబాద్‌లో బీజేపీ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎం. నవీన్‌గౌడ్ ఆధ్వర్యంలో మధుగౌడ్ సంతాప సభ నిర్వహించారు. కార్పొరేటర్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీజేపీ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు బద్రినారాయణ, కంచి కుమార్, బీజేవైఎం మహంకాళి జిల్లా కార్యదర్శులు అనిల్‌కుమార్, కుషాల్‌గౌడ్, బీజేవైఎం నియోజకవర్గం కన్వీనర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడిని అధిగమించాలి

విద్యార్థులకు మెంటల్ హెల్త్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శృతి సూచన

ముషీరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మానసిక ఒత్తిడిని అధిగమించాలని డిస్ట్రిక్ మెంటల్ హెల్త్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శృతి సూచించారు. సోమవారం ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు మానసిక ఒత్తిడికి లోనుకాకుండా ఉండేందుకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆందోళన చెందకుండా చదువుకోవాలన్నారు. మంచి ఆహారం తీసుకోవాలని, సమయ పాలన పాటిస్తూ విద్య అభ్యసించాలన్నారు. హైదరాబాద్ జిల్లాలో 185 పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహిసున్నామని తెలిపారు. ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ ఐఓఎస్ స్వరూపరాణి, ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేందర్ యాదవ్ పాల్గొన్నారు.


విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న డాక్టర్ శృతి

తెలుగు పాటలకు మాస్టార్ ఘంటసాల

● సుద్దాల అశోక్ తేజ


మాట్లాడుతున్న సుద్దాల అశోక్‌తేజ

రాంనగర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): అమర గాయకుడు ఘంటసాల మన మధ్య లేకపోయినా ఆయన పాటలు ప్రతినిత్యం వింటూనే ఉన్నామని ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ అన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఘంటసాల లేని 50 ఏళ్లు - ఆపాత మధురాలు అభ్యుదయ గీతాలు కార్యక్రమం టీపీఎస్‌కే ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న అశోక్‌తేజ మాట్లాడుతూ.. తరాలెన్ని మారినా తెలుగు పాటకు మాస్టార్ ఘంటసాలేనని అన్నారు. భూమి ఆకాశం మనుషులున్నంత కాలం ఘంటసాల పాట ఉంటుందని అన్నారు.

ఆలిండియా ఘంటసాల చైతన్య వేదిక అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరెడ్డి, రమ, శాస్త్రి, నర్సింగ్‌రావు, వేణుమాధవ్, ప్రణీత, అక్షరదీప్తి, ఆల్తా, అన్నపూర్ణ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా ఘంటసాల చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

క్రిస్టియన్ జేఏసీ ప్రతినిధులకు

సంక్షేమ పథకాలు అందజేయాలి


మాట్లాడుతున్న జిలుకర రవికుమార్

బర్కత్‌పుర, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): క్రిస్టియన్ జేఏసీ ప్రతినిధులకు సంక్షేమ పథకాలు అందజేయాలని చైర్మన్ జిలుకర రవికుమార్ డిమాండ్ చేశారు. జేఏసీ తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక పోషించిందన్నారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడితే క్రైస్తవులకు ప్రత్యేక చట్టం వస్తుందని, నిధులు వస్తాయని ఆశించామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఉద్యమంలో పాల్గొన్న వారికి న్యాయం జరగలేదన్నారు. 2,200 మంది జేఏసీ ప్రతినిధులకు ఉద్యమకారులకు కేటాయించే విధంగా 250 గజాల స్థలం, ఇంటి నిర్మాణం కోసం రూ. 9 లక్షలు, పెన్షన్ ఇవ్వాలని ముఖ్యమంత్రిని ఆయన కోరారు. నాయకులు బి.రత్నకుమార్, శ్యామ్‌రావు, బంగారి రమేష్, మేకల సారయ్య, లూదియా, ఎం.పద్మ, ప్రభాకర్, రాజు పాల్గొన్నారు.

పరులకు సహాయపడితే పదవికి సార్థకత

చిక్కడపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఎందరో ప్రభుత్వ పదవులు చేపట్టి ఉండవచ్చని, కానీ ఆ అధికారంలో ఉన్నప్పుడు పరులకు సహాయపడితే సార్థకత చేకూరుతుందని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ శేషశయనరెడ్డి అన్నారు. రమణాచారి వివిధ పదవుల్లో ఉన్న సమయంలో ఆయన సహకారం పొందినవారు ఉద్యోగ విరమణ చేసిన తర్వాత కూడా పుట్టినరోజు సందర్భంలో తమ అభిమానం చూపడం అరుదైన విషయమని పేర్కొన్నారు. జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐఏఎస్ మాజీ అధికారి డా.కేవీ.రమణాచారి పుట్టినరోజు వేడుకల సందర్భంగా హాస్యానందం పత్రిక ఆధ్వర్యంలో జరిగిన కార్టూన్ పోటీలలో విజేతలకు బహుమతి ప్రదానం సోమవారం రాత్రి త్యాగరాయ గానసభలో జరిగింది. చిల్ల రాజశేఖరరెడ్డి, పొత్తూరి సుబ్బారావు, లంక లక్ష్మీనారాయణ, కృష్ణమాచార్యులు, నిర్మల, వెంకటదాసు, గుదిబండి వెంకటరెడ్డి పాల్గొన్నారు. హాస్యానందం ప్రత్యేక సంచికను సంపాదకుడు పి.రాము డా.రమణాచారికి అంకితమిచ్చారు. రమణాచారి దంపతులను జస్టిస్ శేషశయనరెడ్డి సత్కరించారు.


రమణాచారి దంపతులను సన్మానిస్తున్న జస్టిస్ శేషశయనరెడ్డి

బీసీలకు బడ్జెట్‌లో అరకొర నిధులు

నల్లకుంట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): బీసీ కులాలకు బడ్జెట్‌లో అరకొర నిధులు కేటాయించడం సామాజిక స్ఫూర్తికి విరుద్ధమని బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు బూరుగుపల్లి కృష్ణయాదవ్ అన్నారు. సోమవారం విద్యానగర్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో బీసీలకు కేటాయించిన రూ. 8 వేల కోట్లు సరిపోవని, రూ. 20 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. చిన్నయ్య, వెంకటేష్‌యాదవ్, బాలస్వామి, ఎస్. వెంకటేష్, జి. నర్సింహులు, రాజు పాల్గొన్నారు.

శివాజీ జయంతిని అధికారికంగా నిర్వహించాలి

నల్లకుంట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడంతోపాటు ఆ రోజు సెలవు దినంగా ప్రకటించాలని ఛత్రపతి శివాజీ మహారాజ్ ఫౌండేషన్ చైర్మన్ సీడీ చవాన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా కమిటీ అధ్యక్షుడు డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

బర్కత్‌పుర, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): భూమన్న గల్లీ గోపాల్‌కు ఆపరేషన్ నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 1.20 లక్షల చెక్కును కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి బాధితుడికి సోమవారం అందజేశారు. కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్ పాల్గొన్నారు.

డ్రైనేజీ పైపులైన్ పనులు పూర్తిచేయాలి


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

రాంనగర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్‌లో డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జలమండలి అధికారులకు కార్పొరేటర్ కె.రవిచారి సూచించారు. ఆజామాబాద్‌లో రూ. 14 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను సోమవారం పరిశీలించారు.

అవార్డు అందుకోవడం సంతోషంగా ఉంది


అవార్డు అందుకుంటున్న సునీల్

కవాడిగూడ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సేవా రత్న అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందని ఆలిండియా దళిత్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ లక్ష్మీకాంత్ (సునీల్) అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అవార్డు మరింత బాధ్యతను పెంచిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.


అవార్డుగ్రహీతలు, నృత్యకళాకారులతో అతిథులు, నిర్వాహకులు

స్వామి వివేకానంద ఐకాన్ అవార్డ్స్ ప్రదానం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గోల్డెన్‌స్టార్ యూత్ కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద ఐకాన్ అవార్డ్స్-2024 ప్రదానం కళాదీక్షితులు హాలులో జరిగింది. ముఖ్య అతిథిగా మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి పాల్గొని అవార్డులు ప్రదానం చేశారు. ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ ఇండియా చీఫ్ కో-ఆర్డినేటర్ బింగి నరేందర్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన సభలో నాట్యగురువులు డా.యం. కృష్ణప్రియ, కేఎన్.రాజేశ్వరి శ్రీధర్ శిష్య బృందం నృత్య ప్రదర్శనతో ఆహూతులను ఆకట్టుకున్నారు.

ఘనంగా వాగ్గేయకార ప్రయోక్త ఉత్సవం

కవాడిగూడ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): భద్రాచల శ్రీరామదాసు 391వ వాగ్గేయకార ప్రయోక్త ఉత్సవం సోమవారం ట్యాంక్‌బండ్‌పై రామదాసు విగ్రహం వద్ద ఘనంగా జరిగింది. హరిహర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో దుర్గాబాయి దేశ్‌ముఖ్ సంగీత కళాశాల చైర్‌పర్సన్ డాక్టర్ వై.రమాప్రభ బృందం, సంగీత శిక్షణ నిలయం నిర్వాహకురాలు ప్రతిమా శశిధర్ శిష్యబృందం రామదాసు కీర్తనలను హృద్యంగా ఆలపించారు. రాష్ట్ర సాహిత్య అకాడమి కార్యదర్శి డాక్టర్ ఎన్.బాలాచారి, భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పర్సనల్ సెక్రటరీ భాస్కరశర్మ, దైవజ్ఞశర్మ, హరిహర ఫౌండేషన్ అధ్యక్షుడు మారగాని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జీవో 317 బాధితులకు న్యాయం చేయాలి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జీవో 317 బాధితులను తమ సొంత జిల్లాలకు పంపించాలని బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. సోమవారం ఒలింపిక్ భవన్‌లో తెలంగాణ గురుకుల మైనార్టీ అధ్యాపకులు బాధిత ఉద్యోగ ఉపాధ్యాయ జేఏసీని కలిసి మద్దతు తెలిపారు. జేఏసీ అధ్యక్షుడు విజయకుమార్, వర్కింగ్ అధ్యక్షుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ.. మైనార్టీ గురుకులాల్లో జరిగే కొత్త నియామకాల కంటే ముందే తమకు న్యాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

యువతి అదృశ్యం

బర్కత్‌పుర, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఓ యువతి అదృశ్యమైంది. తిలక్‌నగర్ ప్రాంతానికి చెందిన కె.సోమయ్య కుమార్తె కె.అపర్ణ(25) ఆదివారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు సోమవారం కాచిగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో 173 కిలోల గంజాయి పట్టివేత

● ఐదుగురి అరెస్టు.. పరారీలో ఆరుగురు

మహేశ్వరం/చేవెళ్ల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా మహేశ్వరం, చేవెళ్ల ప్రాంతాల్లో గంజాయి ముఠాలు పట్టుబడ్డాయి. వారి నుంచి రూ.46 లక్షల విలువైన 173కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురిని అరెస్ట్ చేయగా.. ఆరుగురు పరారీలో ఉన్నారు. శ్రీశైలం-హైదరాబాద్ రహదారిపై ఆదివారం అక్రమంగా తరలిస్తున్న 109 కిలోల గంజాయిని మహేశ్వరం పోలీసులు పట్టుకున్నారు. దీని విలువ రూ.30 లక్షలు ఉంటుంది. ఏపీ తూర్పు గోదావరి జిల్లా నుంచి మెదక్ జిల్లాకు ఆటోలో గంజాయి తరలిస్తుండగా మహేశ్వరం గేటు వద్ద పట్టుకున్నట్టు డీసీపీ సునీతారెడ్డి తెలిపారు. ఆటోలో ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపూర్ మండలం తుమ్మలచెరువుకు చెందిన సోమ రాకేశ్‌రెడ్డి, తాటి చంటిబాబును అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. ఇదే కేసులో తూర్పు గోదావరి జిల్లాకు చెందిన కోర లోకేశ్, మెదక్ జిల్లాకు చెందిన బాణావత్ రాహుల్ పరారీలో ఉన్నారు.

మరో ఘటనలో..

అక్రమంగా తరలిస్తున్న 64 కిలోల గంజాయిని చేవెళ్లలో పోలీసులు సోమవారం పట్టుకున్నారు. సీఐ లక్ష్మారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన చిత్ర కైలాస్ మోహిత్, నౌనాథ్ గణపత్‌చౌహాన్, మాధన్ బాలసాహెబ్‌బయస్, రాజేష్ సుభాశ్‌మొహితే, రేఖ, మనోజ్ సింగ్వీ, లాము పాలాతీ ముఠాగా ఏర్పడి ఒడిశా నుంచి గంజాయిని అక్రమంగా మహారాష్ట్రకు తరలిస్తున్నారు. చేవెళ్ల శంకర్‌పల్లి చౌరస్తాలో మహారాష్ట్రకు వెళ్లే లారీల కోసం ఎదురుచూస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు గంజాయితోపాటు ముగ్గురుని అదుపులోకి తీసుకున్నారు. నలుగురు పారిపోయారు. వారి నుంచి 64 కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. చిత్రకైలాస్, నౌనాథ్ గణపత్, మాధన్‌ను రిమాండ్‌కు తరలించారు.



కనకాల శ్యామ్‌ను అభినందిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడిగా

కనకాల శ్యామ్ నియామకం

కవాడిగూడ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడిగా కనకాల శ్యామ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ శ్యామ్‌కు సోమవారం నియామక పత్రం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. శ్యామ్ మాట్లాడుతూ.. బీసీ యువజన సంఘాన్ని పటిష్టం చేసి ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా విస్తరింపచేయడానికి తనవంతు కృషి చేస్తానన్నారు. బీసీ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడిగా రావులకోల్ నరేష్‌కుమార్ ప్రజాపతిని కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. బీసీ కులాల ఐక్యవేదిక చైర్మన్ కుందారం గణేష్ చారి, బీసీ విద్యార్థి జాతీయ అధ్యక్షుడు తాటి కొండ విక్రమ్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు కుల్కచర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం


శ్రీరాంనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

రాంనగర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): బాగ్‌లింగంపల్లి శ్రీరాంనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. చైర్మన్‌గా ఎన్.రాములు, అధ్యక్షుడిగా పి.హరినాథ్, ప్రధాన కార్యదర్శి పి. గంగాధర్, కోశాధికారిగా ఎన్.రవి, కమిటీ సభ్యులుగా విశ్వనాథం, శ్రీహరి, గోపి, మోహన్‌రావు, యాదయ్య, మహేష్‌కుమార్, శ్రీనివాస్, నవీన్, సునార్, ఆనంద్‌కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్, అధ్యక్షుడు మాట్లాడుతూ.. బస్తీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

క్యారమ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా సంతోష్‌కుమార్

రాంనగర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): క్యారమ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా సంతోష్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా మదన్‌రాజు, ఉపాధ్యక్షులుగా ఉప్పు సుధాకర్ ఎన్నికయ్యారు. బషీర్‌బాగ్‌లో జరిగిన సమావేశంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఎన్నికల పరిశీలకుడు రమేష్ గౌడ్ కమిటీని ప్రకటించారు.

గంగపుత్ర సంఘం అధ్యక్షుడిగా నర్సింగ్ రెండోసారి ఎన్నిక

చిక్కడపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): అరుంధతినగర్ గంగపుత్రసంఘం అధ్యక్షుడిగా కైరంకొండ నర్సింగ్ రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సభ్యులు నర్సింగ్‌ను సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. గౌరవాధ్యక్షుడు నాగుల ప్రకాష్, ప్రధాన కార్యదర్శి గాండ్ల దేవయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్, పూసరాజు, ఉపాధ్యక్షుడు కాశమేని నవీన్, కోశాధికారి కైరంకొండ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సభను విజయవంతం చేయాలి


శ్రీధర్‌రెడ్డిని సన్మానిస్తున్న శ్రీధర్‌చారి

ముషీరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కృష్ణానది జలాల్లో తెలంగాణ హక్కుల పరిరక్షణ కోసం నల్లగొండలో మంగళవారం నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు కొండా శ్రీధర్‌రెడ్డి కోరారు. సోమవారం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. బహిరంగ సభకు ముషీరాబాద్ నుంచి కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా గౌరీశంకర ఆలయ కమిటీ చైర్మన్ శ్రీధర్‌చారి డివిజన్ అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీధర్‌రెడ్డిని సన్మానించారు. డివిజన్ ప్రధాన కార్యదర్శి ఆకుల అరుణ్‌కుమార్, నాయకులు డి. శివముదిరాజ్, శ్రీధర్, బీఎం శ్రీనివాస్, వీరేశ్, బల్వంతరాజ్ పాల్గొన్నారు.

స్వామి వివేకానంద స్ఫూర్తిపురస్కారం ప్రదానం


శ్రీనివాస్‌కు పురస్కారం బహూకరిస్తున్న హరీష్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా, వెల్దుర్తి గ్రామానికి చెందిన సంఘసేవకుడు అయ్యప్పగారి శ్రీనివాస్‌కు స్వామి వివేకానంద స్ఫూర్తి పురస్కారం బహూకరించారు. కళానిలయం సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి త్యాగరాయగానసభలో జరిగిన కార్యక్రమంలో సినీ నటుడు హరీష్ శ్రీనివాస్‌కు పురస్కారం బహూకరించి అభినందించారు.

ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు

అంబటి కృష్ణమూర్తికి డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న కృష్ణమూర్తి

బర్కత్‌పుర, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తికి డేస్ప్రింగ్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. కార్మికుల సమస్యల పరిష్కారం, పేదల జీవితాలను మెరుగుపరిచే అనేక కార్యక్రమాలు చేపట్టిన కృష్ణమూర్తికి నగరంలో సోమవారం జరిగిన స్నాతకోత్సవంలో డాక్టరేట్ ప్రదానం చేశామని వర్సిటీ అధికారులు తెలిపారు. అమెరికన్ యూనివర్సిటీ తనకు డాక్టరేట్ ప్రదానం చేయడం సంతోషంగా ఉందని అంబటి కృష్ణమూర్తి అన్నారు. డాక్టరేట్‌తో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. యూనివర్సిటీ భారత ఉపాధ్యక్షుడు కందికంట్ల కృపానందం, డైరెక్టర్ దేవరాజ్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్ బ్యాగ్ లాక్కెళ్లిన నిందితుల అరెస్ట్

కవాడిగూడ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆటోలో ప్రయాణిస్తున్న ట్రాన్స్‌జెండర్ చేతిలో ఉన్న బ్యాగు, మొబైల్ ఫోన్ లాక్కెళ్లిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి తులంన్నర బంగారం, ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. దోమలగూడ సీఐ దొంతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. షేక్ సాజిద్ అహ్మద్ ట్రాన్స్‌జెండర్. పార్సిగుట్టలో నివసిస్తూ ఆబిడ్స్ మెథడిస్ట్ డిగ్రీ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతున్నాడు. మల్లేపల్లిలో అన్వర్ ఉల్ ఉలూమ్ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న మహ్మద్ అలీ, ఆబిడ్స్ మెథడిస్ట్ కళాశాలలో డిగ్రీ సెకండ్ ఇయర్ చదువుతున్న మీర్జా ఇస్మాయిల్ అలీ బేగ్ స్నేహితులు. ఆదివారం మధ్యాహ్నం లక్డీకాపూల్ నుంచి ఆటోలో వెళ్తున్న సాజిద్‌ను వారు వెంబడించారు. కట్టమైసమ్మ దేవాలయం సిగ్నల్ వద్ద ఆటో ఆగగానే సాజిద్ చేతిలో ఉన్న బ్యాగ్, సెల్‌ఫోన్ లాక్కొని పారిపోయారు. ట్రాన్స్‌జెండర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించి నిందితులను పట్టుకుని రిమాండ్‌కు తరలించారు.